మోక్షమెన్నడో..?

- దారుణంగా.. నరకప్రాయంగా వెంకటాపురం, మెట్టపాలెం రహదారులు
- అవస్థలు పడుతున్న గ్రామాల ప్రజలు
- మరమ్మతుల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

పరవాడ: ప్రజలు సాఫీగా రాకపోకలు సాగించాల్సిన రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం, నాయుడుపాలెం శివారు మెట్టపాలెం గ్రామాల రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఎందరో ప్రజాప్రతినిధులు వచ్చి పోతున్నా.. తమ గ్రామ రహదారులకు మోక్షం మాత్రం లభించడం లేదని వెంకటాపురం, మెట్టపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు రోడ్లకు కనీస మరమ్మతులు **చేపట్టకపోవడంతో అనేక గ్రామాల ప్రజలు రాకపోకల సమయంలో నిత్యం అవస్థలు పడుతున్నారు. తమ ఆవేదనను పట్టించుకునే నాథుడు లేక ఏళ్ల తరబడి శిథిల రోడ్లతో నరకయాతన పడుతున్నామని గగ్గోలు పెడుతున్నారు. అధికారంలోకి** వస్తే రోడ్లు బాగుచేస్తామని ఎన్నికల్లో హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం.. ఏడాదవుతున్న రోడ్ల దుస్థితిని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెట్టపాలెం రోడ్డులో అడుగుకో గొయ్యి

అడుగుకో గుంతతో నిండిన మెట్టపాలెం రహదారి దుస్థితి మరింత అధ్వానంగా మారింది. దశాబ్దం నుంచి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. ఫలితంగా మెట్టపాలెం, పాతరాజాన్నపాలెం, దోసూరు, గండివానిపాలెం, కొల్లివానిపాలెం గ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల్లో రైతులు కూరగాయల పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరు పండించిన పంట ఫలసాయాలను గాజువాక, విశాఖ నగరాలకు తీసుకెళ్లి విక్రయించగా వచ్చిన ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. అధ్వానంగా మారిన రహదారిలో ఆర్టీసీ బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్న నేపథ్యంలో అధికారులు వాటిని నడపడం ఆపేస్తున్నారు. మూడు కిలోమీటర్ల రహదారిలో అడుగుకో గుంత ఏర్పడటంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో వీధి లైట్లు లేక చీకటి పడితే ఇళ్లకు చేరడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుంతలమయంగా మెట్టపాలెం రహదారి

పాలకులు, అధికారులు స్పందించి వెంకటాపురం, మెట్టపాలెం రహదారులను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రహదారిని బాగు చేయాలి



వాడచీపురుపల్లి–వెంకటాపురం రహదారిలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. రోడ్డంత పెచ్చులుగా ఊడిపోవడంతో వాహనాలు పాడవుతున్నాయి. వాడచీపురుపల్లిలోని బ్యాంకు, వ్యాపార లావాదేవీలు, ఇతర పనులకు గ్రామస్తులు వెళ్లి రావాల్సి ఉంటుంది. రోడ్డులో లైట్లు లేక చీకటి పడితే భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నాం. వర్షం పడితే గోతులు గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

– షేక్ సైదులు, నునపర్తి

రోడ్డంతా గుంతలమయం



అడుగుకో గుంతతో నిండిన మెట్టపాలెం రోడ్డులో ప్రయాణం సాగించడం కష్టంగా ఉంది. ఏ మాత్రం వర్షం పడిన గుంతల్లో నీరు చేరి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డులో వీధి లైట్లు లేక రాత్రి వేళ అవస్థలు పడుతున్నాం. రోడ్డు అధ్వానంగా మారడంతో ఆర్టీసీ అధికారులు బస్సులు రద్దు చేస్తున్నారు. కూరగాయల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. అధికారులు రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి.

– రామిడి కృష్ణ, మెట్టపాలెం

వెంకటాపురం రోడ్డులో రాకపోకలకు తంటాలు



ధ్వంసమైన వెంకటాపురం రహదారి

సుమారు 2 కిలోమీటర్ల గల వాడచీపురుపల్లి–వెంకటాపురం రహదారి పదేళ్ల నుంచి మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. గొల్లగుంట, రావాడ, నునపర్తి, వెంకటాపురం గ్రామాల ప్రజలు వాడచీపురుపల్లిలోని మార్కెట్, బ్యాంకు పనులు, కూలి పనులకు వెళ్లే కార్మికులు, వ్యవసాయ రైతులు, పాఠశాలల విద్యార్థులకు ఈ రహదారి అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ఈ రోడ్డు మరమ్మతులకు గురై రాళ్లు తేలి పాదచారులను ముప్పుతిప్పలు పెడుతోంది. వాహన టైర్లకు రాళ్లు గుచ్చుకొని పంక్చర్లు పడుతుండటంతో వాహన చోదకులు తంటాలు పడుతున్నారు. ఈ రోడ్డులో విద్యుత్ లైట్ల ఏర్పాటుకు పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో రాత్రి వేళల్లో ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు అంధకారంలో బిక్కు బిక్కుమంటూ విషజీవులను దాటుకుని ఇళ్లకు చేరుతున్నారు. వర్షా కాలం వచ్చిందంటే రోడ్డుపై గోతుల్లో నీరు నిలిచిపోయి అవి ఎక్కడున్నాయో తెలియని పరిస్థితిలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు అనేకమున్నాయి.

అధ్వాన రహదారిలో అవస్థల ప్రయాణం



అధ్వానంగా సబ్బవరం పీహెచ్‌సీ రోడ్డు

సబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరి అధ్వానంగా మారింది. సబ్బవరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వైద్య సేవల కోసం నిత్యం ఈ ఆస్పత్రిని ఆశ్రయిస్తారు. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిని ఆనుకుని ఇది ఉండటంతో రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారు సైతం ఇక్కడ చికిత్స నిమిత్తం చేరుతుంటారు. రహదారి దెబ్బతినడంతో రోగులతోపాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. హాస్పిటల్ భవనం కూడా కాలం చెల్లడంతో శిథిలావస్థకు చేరింది. ఆస్పత్రికి వెళ్లే రోడ్డుతోపాటు ప్రధాన రహదారిలో ఏ విధమైన ముఖద్వారం లేకపోవడంతో కొత్తగా ఇక్కడికి వచ్చేవారు ఆస్పత్రిని గుర్తించలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సబ్బవరం ఆస్పత్రికి వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా నృసింహ జయంతి

సీతంపేట: నృసింహ జయంతి సందర్భంగా ఆదివారం అక్కయ్యపాలెం లలితా పీఠంలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం పీఠం దర్బారు హాల్‌లో ధన్వంతరి సహిత శ్రీసుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

నీతి కథలపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జానకీరామ్ చిన్నారులకు నీతి కథలు బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేశారు. బి.లక్ష్మితేజ విద్యార్థులతో యోగాసనాల అభ్యసనం చేయించారు. బొమ్మలు వేయడం నేర్పించారు. ఇంగ్లిష్ గ్రామర్, ఇతర అంశాలపై విద్యార్థులకు తర్ఫీదునిచ్చారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇండోర్ గేమ్స్, క్విజ్ పోటీలు



ఇండోర్ గేమ్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు ఇండోర్ గేమ్స్, మ్యూజికల్ చైర్స్, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కె.ఎస్.ఆర్.మూర్తి, కార్మిక నాయకుడు సిహెచ్.ఎస్.ఎన్.రాజు, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం ఈ కార్యక్రమాలు నిర్వహించారు. న్యాయవాది రామకృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుడికి ఆర్థిక సాయం



సోమేష్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న బాల్య స్నేహితులు

పరవాడ: మండలంలోని భర్నికం గ్రామానికి చెందిన ఓ న్యూస్ ఛానల్ పాత్రికేయుడు సోమేష్ ఇటీవల ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సోమేష్‌కు సర్జరీ జరిగిన తరువాత ఆరు నెలలు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. కుటుంబ పోషణ కష్టంగా మారిన సోమేష్ కుటుంబాన్ని ఆదుకోవాలనే తలంపుతో అతడి బాల్యమిత్రులు ముందుకొచ్చారు. దేవరాపల్లి మండలం తెనుగుపూడిలో 2006–08లో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో చదువుకున్న సోమేష్ చిన్ననాటి స్నేహితులు రూ.21 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఆపదలో సాయమందించిన స్నేహితులకు సోమేష్ కృతజ్ఞతలు తెలిపాడు.

ఆదిత్యుడికి అభిషేకాలు



పూజలందుకున్న సూర్యనారాయణ స్వామి

పెందుర్తి: సుజాత నగర్‌లోని సూర్య నారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. ఆదిత్యుడిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యుడికి పంచ హారతి, నక్షత్ర హారతి సమర్పించారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాతృమూర్తులను గౌరవిద్దాం

గోపాలపట్నం: మాతృ దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం కళాసేవా పీఠం ఆధ్వర్యంలో ఆదివారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. ఆస్పత్రిలో తల్లులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలోని మాతృమూర్తి విగ్రహానికి అంజలి ఘటించారు. అనంతరం మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. కళాసేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ ఏ జీవికైనా తల్లి అంకురమన్నారు. అమ్మ మనకు కనిపించే దైవమని.. ప్రతి ఒక్కరూ తల్లి దండ్రులను గౌరవించాలని కోరారు. గౌరవ అధ్యక్షుడు చందు సుబ్బారావు మాట్లాడుతూ అమ్మ ప్రేమ ఉన్నతమైనదన్నారు. అధ్యక్షుడు గొర పల్లి బంగార్రాజు మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లులను బాగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గొరకల రామదాసు, ఉపాధ్యక్షుడు బందారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ



అమ్మవారి ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు



కోట్నివానిపాలెంలో పూజలందుకున్న మరిడిమాంబ



అనుపోత్సవంలో సందడి చేస్తున్న గ్రామస్తులు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెం గ్రామదేవత మరిడిమాంబ వార్షిక పండగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు–కుంకుమలు, చీరలు, ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో భక్తులు అగ్నిగుండాలు తొక్కారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో సుమారు 2 వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు వేడుకగా జరిగింది. గంగమ్మపేట నుంచి ప్రారంభమై గొరపల్లి మీదుగా అమ్మవారి ఆలయం వరకు దారి పొడవునా అమ్మవారి ఘటాలకు ప్రజలు మొక్కులు సమర్పించుకున్నారు. డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అనుపోత్సవం వైభవంగా నిర్వహించారు. కోట్నివానిపాలెం, గొరపల్లి, కరకవానిపాలెం, గొల్లలపాలెం, గవరపాలెం, గంగమ్మపేట తదితర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

15న బంగారమ్మ పండగ

గొరపల్లి పంచాయతీ గంగమ్మపేటలో కొలువుదీరిన బంగారమ్మతల్లి వార్షిక పండగను ఈ నెల 15న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి పండగ చాటింపు జరిపారు. నాలుగు గ్రామాల దేవతగా పూజించే బంగారమ్మ పండగను గొరపల్లి, కరకవానిపాలెం, కోట్నివానిపాలెం, గంగమ్మపేటల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

శారదా పీఠంలో యాగం ప్రారంభం



స్వామీజీల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న యాగం

పెందుర్తి: భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశ రక్షణ, విజయం కోసం శారదా పీఠం తలపెట్టిన వజ్రిణి స్కంద పాశుపత హనుమద్యాగం ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో తొలి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, అగ్ని సంస్కారం జరిపారు. అనంతరం స్కంద పాశుపత హోమం, చండీ నవార్ణ మహామంత్ర హోమం, దక్షిణామూర్తి స్వరూప సాంబ సదాశివ హోమం, వీరాంజనేయ హోమం వేద మంత్రోచ్చారణల మధ్య పండితులు అంకురార్పణ చేశారు. అపరాజిత స్తోత్రం, మహిషాసురమర్దిని స్తోత్రం, కాలభైరవాష్టకం, హనుమాన్ చాలీసా పారాయణ పఠించారు. ఈ నెల 22 హనుమత్ జయంతి వరకు ఈ క్రతువు కొనసాగుతుందని ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర తెలిపారు.

క్రీడాకారులకు అభినందన



యూత్ గేమ్స్‌కు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: బిహార్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–25కు పరవాడ, అచ్యుతాపురం మండలాల నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ గొర్లి పుష్పారావు తెలిపారు. వీరిలో వాడచీపురుపల్లి శివారు వెంకటాపురానికి చెందిన గొర్లి స్నేహ, గండి దీక్షిత్, అచ్యుతాపురానికి చెందిన డి.ఎ.గౌతమ్ ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం క్రీడాకారులను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అభినందించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రాణించాలని ఆకాంక్షించారు. పరవాడ ప్రాంతం నుంచి ముగ్గురు క్రీడాకారులను ఎంపిక చేయడంపై ఏపీ థాంగ్ టా అసోసియేషన్ చీఫ్ ఎం.తులసీరావు ఆనందం వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోచ్ పుష్పారావును ప్రత్యేకంగా అభినందించారు.

సందేశాత్మకంగా బుద్ధ పౌర్ణమి ధ్యానోత్సవాలు



ధ్యాన గురువులను సత్కరిస్తున్న నిర్వాహకులు

పెందుర్తి: స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్, ఉత్తరాంధ్ర ధ్యాన మాస్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో తలపెట్టిన బుద్ధ పౌర్ణమి ధ్యానోత్సవాలు రెండో రోజు ఆదివారం సందేశాత్మకంగా సాగాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రాతఃకాల ధ్యానం చేశారు. అనంతరం గాయత్రి విభావరి మృదంగం, కోలాటం ఆకట్టుకున్నాయి. బాజీ జంక్షన్‌కు చెందిన శైలపతి భరద్వాజ ఆధ్వర్యంలో వేణు నాదం సాగుతుండగా ఆహుతులు సామూహిక ధ్యానం చేశారు. పి.అన్నపూర్ణ, దివ్యగంద ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. శ్రీకాకుళానికి చెందిన స్వాతి సోమనాథ్ బృందం ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ముందుగా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ధ్యాన మాస్టర్లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సోమవారంతో ధ్యానోత్సవాలు ముస్తాయని నిర్వాహకులు తెలిపారు.



వేణునాదం చేస్తున్న భరద్వాజ



ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్యం

కులగణనతోనే బీసీలకు న్యాయం



కట్టా మల్లేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న పూర్ణచంద్రరావు

సీతంపేట: కులగణనతోనే బీసీలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యం లభిస్తుందని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు అన్నారు, ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం బీసీ సమన్వయ కమిటీ ఉత్తరాంధ్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కట్టా మల్లేశ్వరరావును కమిటీ విశాఖ జిల్లా అధ్యక్షునిగా నియమించి నియామక పత్రం అందజేసి సత్కరించారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జనాభాలో 60 శాతం బీసీ కులాలు ఉన్నప్పటికీ రాజకీయ, విద్య, ఉద్యోగాలలో తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. కులగణన జరిగితే జనాభా దామాషా ప్రకారం బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర బీసీ సమన్వయ కమిటీ పార్టీలకు అతీతంగా బీసీ సమస్యలపై పోరాటం చేస్తూ అన్ని కుల, ప్రజా సంఘాలను కలుపుకుని సమగ్ర కులగణన సాధించుకున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి, పోరాటం చేసిన అన్ని సంఘాలకు అభినందనలు తెలిపారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న నిబంధన ఎత్తివేయాలన్నారు. అగ్రకులాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కేటాయించడం వల్ల జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు నష్టపోతున్నారని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై పునఃసమీక్ష చేయాలని కోరారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ



జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో కార్డన్ సెర్చ్ చేస్తున్న సీఐ సతీష్‌కుమార్, ఎస్‌ఐలు, సిబ్బంది

పెందుర్తి: నేర ప్రవృత్తి కలిగిన ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని సీఐ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరినీ విడిచిపెట్టబోమని హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని చినముషిడివాడ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, బృందావన కాలనీ ప్రాంతాల్లో ఆదివారం వేకువజాము 5 నుంచి ఉదయం 7.45 గంటల వరకు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అడుగడుగునా క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. పత్రాలు సక్రమంగా లేని ఓ ఆటోను, 8 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల గురించి ఆరా తీయాలని సూచించారు. అలాంటి వ్యక్తుల వాహనాలను, ఇతర సమాచారాన్ని తక్షణమే పోలీసులకు అందించాలని కోరారు. చోరీల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ అంశంలో ప్రజల సహకారమే కీలకమన్నారు. రానున్న రోజుల్లో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఎస్‌ఐలు అసిరితాత, దేముడునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నం రైల్వే స్టేషన్‌లో కళాజాత



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

గోపాలపట్నం: ఎయిడ్స్ నియంత్రణపై గోపాలపట్నం, సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆదివారం కళాకారులు కళాజాత నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాజాత నిర్వహిస్తున్నామని కళాకారులు తెలిపారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో కళాప్రదర్శనకు అనుమతిచ్చిన ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ ఎస్‌వీఎస్ రావు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం




చినముషిడివాడలో సీఐ ఆధ్వర్యంలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు



మేహాద్రి గెడ్డ ప్రాంతంలో అనుమానితులను ప్రశ్నిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: సమాజ శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని రానున్న రోజుల్లో పగడ్బందీగా నాఖా బందీ కార్యక్రమం నిర్వహిస్తామని సీఐ కె.వి.సతీష్ కుమార్ తెలిపారు. చినముషిడివాడ, పెందుర్తి రైల్వే స్టేషన్, మేహాద్రి గెడ్డ రిజర్వాయర్, పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి ప్రాంతాల్లో సీఐ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నాఖా బందీ నిర్వహించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని విడిచిపెట్టబోమన్నారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ తమ లక్ష్యమని చెప్పారు. ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాహార్తి తీర్చడంలో మేము సైతం



మజ్జిగ పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డుకు చెందిన ఎంఎంఆర్ మహిళా గ్రూప్ సభ్యులు సేవా కార్యక్రమానికి ముందుకు వచ్చారు. భానుడి ప్రతాపానికి విలవిల్లాడుతున్న వారి దాహార్తి తీర్చాలని ఆదివారం పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎస్ఎస్‌టీఎల్ నుంచి సింహాచలం వెళ్లే 80 అడుగుల దారిలో టెంటు ఏర్పాటు చేసి ప్రయాణికులకు మజ్జిగ అందిస్తున్నారు.

దశాబ్ద కాలంగా సేవలు: బాజీ జంక్షన్, సుసర్ల కాలనీలకు చెందిన మహిళా గ్రూప్ సభ్యులు ఎంఎంఆర్ గ్రూప్‌గా ఏర్పడి దశాబ్ద కాలంగా చేస్తున్న సేవలు ఎంతో మందికి బాసటగా నిలుస్తున్నాయి. ఏటా వేసవి కాలంలో రోజుకు సుమారు 400 మందికి మజ్జిగ పంపిణీ చేస్తూ దాహార్తి తీరుస్తున్నారు. భగవాన్ సత్యసాయి భక్త బృందంతో కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరి సేవలు మరెంతోమందికి స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడుతున్నారు.